క్లుప్తంగా

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి



అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న సబితారెడ్డి

శంకర్‌పల్లి: ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మహాలింగపురం గ్రామంలో నిర్వహించిన పోచమ్మజాతర, జనవాడ గ్రామంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జాతరలు నిర్వహించడం మన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అన్నారు. ప్రతి ఒక్కరు మన ఆచారాలను మరువ కూడదన్నారు. గ్రామాల్లో ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో ఐకమత్యంతో జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య, సర్పంచ్ లలిత , ఎంపీటీసీ నాగేందర్, వార్డు సభ్యులు గొడిచర్ల వెంకటేష్, రాధిక, శివరాజ్, జైపాల్, మల్లేష్, నర్సింలు పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తుల సమాచారం ఇవ్వండి



బైక్‌పై తిరుగుతున్న వ్యక్తులను గుర్తించిన పోలీసులు

షాద్‌నగర్‌రూరల్: ద్విచక్రవాహనాలపై తిరుగుతూ చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న అనుమానాస్పద వ్యక్తులను సీసీ ఫుటేజీలో గుర్తించినట్లు, మీకు ఎవరికైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని షాద్‌నగర్ పట్టణ సీఐ నవీన్‌కుమార్ తెలిపారు. ద్విచక్రవాహనాలపై తిరుగుతున్న చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న వ్యక్తులకు సంబంధించిన ఫొటోలను ఆదివారం సీఐ విడుదల చేశారు. ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని ఎవరికైనా కనిపిస్తే వెంటనే 100కు డయల్ చేయాలని, లేదంటే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

పరిహారం ఇచ్చే వరకు పోరాటం

సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు



రోడ్డుపై వంటావార్పు నిర్వహిస్తున్న రైతులు

షాబాద్: అధికారులు వచ్చి పరిహారం ఇచ్చే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని చందనవెల్లి భూనిర్వాసితుల సంఘం అధ్యక్షుడు నీరటి ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని హైతాబాద్ వద్ద భూనిర్వాసితులు చేస్తున్న ధర్నా 162వ రోజుకు చేరింది. దీంతో రైతులు రోడ్డుపై వంటవార్పు కార్యక్రమంతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్, చేవెళ్ల ఆర్డీఓ వచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. న్యాయపరంగా తమకు అందాల్సిన పరిహారం అక్రమార్కులు, బినామీల జేబులోకి వెళ్లిపోయిందన్నారు. దీనికంతటికీ అధికారులు, ప్రజాప్రతినిధులే కారమని ఆరోపించారు. రైతులకు న్యాయం జరిగే వరకు ఎన్నిరోజులైనా, ఎంత దూరమైనా వెళ్తామని స్పష్టం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో భూనిర్వాసితులు అనంతం, శోభ, రెడ్డయ్య, బాలయ్య, హనుమంతు, గిరిగాబు, రాంబాబు, అనంతయ్య, నర్సింహులు, భాగ్యమ్మ, జంగయ్య, మల్లేష్, కిష్టయ్య, బాలకిష్ట, సుగుణమ్మ, యాదమ్మ, చంద్రమ్మ, తదితరులున్నారు.

ఎస్‌టీఎఫ్ మండల నూతన అధ్యక్షుడిగా శ్రీనివాస్

మొయినాబాద్ రూరల్: మండల ఎస్‌టీఎఫ్ నూతన అధ్యక్షుడిగా శ్రీనివాస్‌ను ఉపాధ్యాయులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ చౌరస్తాలో గల విజయతాగూర్ గార్డెన్‌లో ఎస్‌టీఎఫ్ ఉపాధ్యాయ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య పాల్గొని ఉపాధ్యాయ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షుడిగా జి.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సుజాతలకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కమిటీలో ప్రధాన కార్యదర్శి సుధాకర్, మహిళా కార్యదర్శి పరమేశ్వరి, కోశాధికారి వెంకటస్వామి, కార్యదర్శులు సంతోషి, రాజు, శోభారాణి, మండల గౌరవ అధ్యక్షుడు రమేష్‌లకు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠశాల విధివిధానంలో సక్రమంగా పని చేస్తూ విద్యార్థులను అభివృద్ధి చేయాలని తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించుకునేందుకు కలిసి పోరాడుదామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జనార్దనాచారి, ప్రధాన కార్యదర్శి గోపాల్, గౌరవ అధ్యక్షుడు సత్యనారాయణ, రాంచందర్ పాల్గొన్నారు.

మల్లన్న కల్యాణ వైభోగం

- ఘనంగా చిలుకూరు మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం



భక్తజనంతో కిక్కిరిసిపోయిన చిలుకూరు మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణం

మొయినాబాద్: వేద పండితుల మంత్రోశ్చరణలు.. మంగళావాయిద్యాల చప్పుళ్లు.. భక్తుల జేజే ధ్వనుల మధ్య మల్లికార్జున స్వామి కల్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్సవాల్లో భాగంగా ఉదయం ధ్వజారోహణం, భ్రమరాంబ మల్లికార్జున స్వామివారికి అభిషేకం, ఎల్లమ్మ బోనాల ఊరేగింపు చేపట్టారు. మధ్యాహ్నం స్వామివారి కళ్యాణోత్సవం, సాయంత్రం బోనాల ఊరేగింపు నిర్వహించారు. చిలుకూరుతో పాటు పరిసర గ్రామాలు, ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణమంతా భక్తజన సందోహంతో నిండిపోయింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు.

కన్నుల పండువగా కల్యాణోత్సవం..

మల్లికార్జున స్వామివారి కల్యాణోత్సవం ఆలయం పక్కన ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ మండపంలో స్వామివారు, అమ్మవారు దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించి, పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ సంగెరి మల్లేష్ దంపతులు, గ్రామ సర్పంచ్ స్వరూప, ఆంద్రూ దంపతులు, దండు సురేందర్ దంపతులు, విక్రంరెడ్డి దంపతులు, రాంచందర్ దంపతులు చేతులమీదుగా స్వామివారి కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం శివసత్తుల ఆటలు, పోతురాజుల విన్యాసాలతో బోనాల ఊరేగింపు ఘనంగా జరిగింది. తరువాత శివసత్తులు అగ్నిగుండాలు తొక్కగా ఒగ్గువారు ఉక్కుగొలుసు తెంపారు.

స్వామివారికి వెండి ఆభరణాలు సమర్పణ

భక్తులు హిమాయత్‌నగర్‌కు చెందిన రాంచందర్, ముర్తుజాగూడకు చెందిన విక్రంరెడ్డి స్వామివారికి వెండి ఆభరణాలు సమర్పించారు. రాంచందర్ స్వామివారికి 2 కిలోల వెండి కిరీటం, విక్రంరెడ్డి స్వామివారికి, ఎల్లమ్మదేవికి 5 కిలోల వెండి ఆభరణాలు బహూకరించారు.



స్వామివారికి కల్యాణం జరిపిస్తున్న పూజారులు

మల్లన్నను దర్శించుకున్న ప్రముఖులు

చిలుకూరు మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం ఎమ్మెల్యే కాలె యాదయ్య, టీఆర్ఎస్ నేత క్యామ మల్లేష్, చిలుకూరు ఆలయ అర్చకులు రంగరాజన్, సురేష్‌స్వామి, మాజీ ఎమ్మెల్యే కేఎస్. రత్నం తదితరులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. వారితో పాటు చిలుకూరు సర్పంచ్ స్వరూప, ఎంపీపీ గునుగుర్తి నక్షత్రం, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మహేందర్, ఉపసర్పంచ్ సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పురాణం వీరభద్రస్వామి, మాజీ ఉపసర్పంచ్‌లు ఆంద్రూ, గోపాల్‌రెడ్డి, నాయకులు శ్రీరాములు, జయవంత్, రాజు, కుమార్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామి సన్నిధిలో కాసాని

మొయినాబాద్: మండల పరిధిలోని నాగిరెడ్డిగూడలో జరుగుతున్న మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల్లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు. ఆదివారం ఆయన నాగిరెడ్డిగూడలోని మల్లికార్జునస్వామి ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తిశ్రద్ధలతో స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట టీడీపీ చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి కొమ్మిడి వెంకట్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపతి సతీష్, ఎంపీటీసీ అర్జున్, నాయకులు మాధవరెడ్డి, భిక్షపతియాదవ్, అశోక్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న మొయినాబాద్ కాంగ్రెస్ నాయకులు

మొయినాబాద్ రూరల్: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం గ్రామస్థాయి నుంచి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని బాకారం, అమ్డాపూర్, ఎన్కెపల్లి, మంగాలిగూడ, హిమాయత్‌నగర్ గ్రామాల కాంగ్రెస్ నాయకులు రేవంత్‌రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులతో మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని అభివృద్ధి చేస్తూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం కృషి చేయాలని తెలిపినట్లు నాయకులు చెప్పారు. టీపీసీసీని కలిసిన వారిలో మొయినాబాద్ మండలం బాకారం కాంగ్రెస్ నాయకులు టీపీసీసీ మత్స్యకారుల కార్యదర్శి నారాయణపురం మహేందర్ ముదిరాజ్, హిమాయత్‌నగర్ గ్రామ అధ్యక్షుడు బిస నర్సింహ ముదిరాజ్, అమ్డాపూర్ ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, ఎన్కెపల్లి కాంగ్రెస్ నాయకులు, మాజీ ఉపసర్పంచ్ కావలి రమేష్, మల్లేష్, భిక్షపతి, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

వెంకట్‌రెడ్డి మృతి పార్టీకి తీరనిలోటు



కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు

షాబాద్: మండల పరిధిలోని రేగడిదోస్వాడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పీసరి వెంకట్‌రెడ్డి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చేవెళ్ల, కొడంగల్ ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, పట్నం నరేందర్‌రెడ్డిలు ఆదివారం రేగడిదోస్వాడ గ్రామానికి వెళ్లి పీసరి వెంకట్‌రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంకట్‌రెడ్డి మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరనిలోటని అన్నారు. వారి వెంట సహకార సంఘం వైస్ చైర్మన్ మద్దూరు మల్లేష్, సర్పంచ్ రాములు, మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, ఎంపీటీసీ పార్వతమ్మ, సహకార సంఘం డైరెక్టర్ రాజారత్నం, నాయకులు రాంచంద్రయ్య, తదితరులున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



టీచర్‌ను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

మొయినాబాద్: పన్నెండేళ్ల క్రితం ఒకే పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలిశారు. మండల పరిధిలోని వెంకటాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008–09లో 10వ తరగతి చదివినవారు ఆదివారం మండల పరిధిలోని ఓ రిసార్ట్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి మధుర జ్ఞాపకాలు, చిలిపి పనులను గుర్తుచేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయురాలు జ్యోతిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా బుర్జు మైసమ్మకు పూజలు



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న పూజారులు

చేవెళ్ల: మండలంలోని మల్లారెడ్డిగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన బుర్జుమైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం గ్రామంలోని ప్రజలు, సర్పంచ్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయంలో ప్రతిష్ఠ పూజలు, హోమాలు నిర్వహించారు. గ్రామంలో ఏళ్లతరబడిగా బుర్జుమైసమ్మ దేవాలయం చిన్నదిగా బుర్జులో ఉండడంతో అదే స్థానంలో బుర్జుకు అనుకొని కొత్తగా చిన్న ఆలయం నిర్మించి అమ్మవారిని ప్రతిష్ఠించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు హోమాలు గ్రామస్తులతో కలిసి నిర్వహించినట్లు చెప్పారు. నూతన ఆలయంలో అమ్మవారికి శుక్రవారం నాడు గ్రామస్తులంతా కలిసి బోనాలు సమర్పించడం జరుగుతుందని చెప్పారు. ఈ పూజల్లో గ్రామపెద్దలు ప్రజలు పాల్గొన్ని అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే, ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు మాధవ్‌రెడ్డి, వెంకటేశ్, రఘువేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి, మల్లారెడ్డి, ప్రవీణ్, తదితరులు ఉన్నారు.

రహదారికి మరమ్మతులు చేపట్టండి

కొత్తూరు: జాతీయ రహదారి నుంచి కొత్తూరు పట్టణంలోకి వచ్చే ప్రధాన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, వ్యాపారులు కోరుతున్నారు. గత కొన్నేళ్ల నుంచి కనీస మరమ్మతులు చేపట్టని కారణంగా వైజంక్షన్ కూడలి నుంచి ఎస్‌బీఐ బ్యాంకు వరకు రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారిందన్నారు. దానికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో మట్టిని పోయడంతో వాహనాల రాకపోకల సమయంలో విపరీతమైన దుమ్ము వెలువడుతుందని వాపోతున్నారు. దుమ్ము కారణంగా దుకాణాల్లో వస్తువులు పాడుకావడంతో పాటు శ్వాసకోస వ్యాధుల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ, ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు.

ఐకమత్యంతో కాంగ్రెస్‌ను గెలిపిద్దాం

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్



షాద్‌నగర్: సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

నందిగామ: కాంగ్రెస్ పార్టీ నాయకులు.. కార్యకర్తలందరం కలిసి కట్టుగా ఉండి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెద్దామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు జంగ నర్సింహా యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. కేంద్రం, రాష్ట్రంలో ప్రజావ్యతిరేఖ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయని ఆ పార్టీలకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని మండిపడ్డారు. దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తానని హామీ ఇచ్చిన కేసీఆర్ దళితులను నట్టేట ముంచాడని విమర్శించారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టనున్న హాత్ సే హాత్ జోడో పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పాండురంగారెడ్డి, ఎంపీటీసీలు చంద్రపాల్‌రెడ్డి, కొమ్ము కృష్ణ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రజినీకాంత్, నాయకులు రాంరెడ్డి, శంకరయ్య, నర్సింహులు, సుధాకర్‌గౌడ్, శ్రీశైలం, శ్రీనునాయక్, సూక్యానాయక్, యాదయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

షాద్‌నగర్: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి శంకర్ అన్నారు. ఆదివారం షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో నూతన వార్డు కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నుంచి సుమారు 40 మంది శంకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ప్రజలకు మాయమాటలు చెప్పి ఓట్లు దండుకున్నారని అన్నారు. రెండుసార్లు అధికారం చేపట్టిన బీజేపీ, టీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేశాయని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, రఘునాయక్, పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, ఖదీర్, ముబారక్, గంగనమోని సత్తయ్య, సాయి, రాజేశ్వర్, జాఫర్, సత్యం, హరికృష్ణ పాల్గొన్నారు.

వణికిస్తున్న చలి



గత రెండు రోజులుగా చలి వణికిస్తోంది.. ఉదయం 9 గంటలు కావస్తున్నా నిండా మంచుతో మూసుకొని చీకటిని తలపిస్తుంది. ఆదివారం కొందుర్గు మండలం ముట్పూర్‌లో ఈ పరిస్థితి చోటు చేసుకుంది. 9 గంటల అనంతరం మంచుకొండలను చీల్చుకుంటూ భానుడు బయటికి రావడం చూపరులను కనువిందు చేసింది. భానుడు బయటికి రావడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ దృశ్యాలను సాక్షి కెమెరాలో బంధించింది.

– కొందుర్గు

పండుగలకు ఊరెళ్తున్నారా.. తస్మాత్ జాగ్రత్త

చేవెళ్ల సీఐ వెంకటేశ్వర్లు



చేవెళ్ల: పండుగలకు ఊర్లకు వెళ్లే వారు తస్మాత్ జాగ్రత్త ఉండాలని చేవెళ్ల సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. సైబరాబాద్ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు సంక్రాంతి పండుగ సెలవుల్లో దొంగతనాలు నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఊరు వదిలి వెళ్లాల్సి వస్తే మీ విలువైన బంగారు, వెండి ఆభరణాలు, డబ్బులు తదితర వాటిని బ్యాంక్ లాకర్లలో పెట్టి భద్రపరుచుకోవాలని లేదంటే రహస్య ప్రదేశాల్లో దాచుకోవాలని సూచించారు. ఇంట్లో సీసీ కెమెరాలు బిగించుకొని డీవీఆర్‌ను కనపడకుండా ఇంటిలోపల పెట్టుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు ఫోన్‌లో సీసీ కెమెరాల ద్వారా ఇంటిని పరిశీలిస్తుండాలని సూచించారు. సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సర్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమానిత వ్యక్తులు ఇంటి పరిసరాల్లో కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ ఉండే తాళాలను బిగించుకోవడం మంచిదన్నారు. తాళం వేసి ఊరికి వెళ్లే సమయంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని చెప్పారు. వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కు చేసుకోవాలని ద్విచక్రవాహనాలకు తప్పనిసరిగా తాళం వేయాలన్నారు. ఇంట్లో లేని సమయంలో ఇంటికి వచ్చే పాలప్యాకెట్లు, న్యూస్‌పేపర్లు వేయకుండా ముందుగానే సమాచారం అందించాలన్నారు. ఇంటికి తాళం వేసిన విషయం కనిపించకుండా కర్టన్స్‌ను కప్పి ఉంచాలన్నారు. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఒక లైట్ ఇంట్లో బయట వేసి ఉండేలా చూసుకోవాలని చెప్పారు. సోషల్ మీడియాల ద్వారా మీరు ఊరేళ్తున్న విషయాలను పోస్ట్ చేయొద్దని తెలిపారు. పోలీసులకు సమాచారం ఉంటే ఆ ఏరియాలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు తగిన జాగ్రత్తలు వహించి పోలీసులకు సహకరించాలన్నారు.

నేడు 'కంటి వెలుగు'పై అవగాహన

కేశంపేట: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమంపై మండల కేంద్రంలో అవగాహన సమావేశం ఎంపీపీ ఎల్గనమోని రవీందర్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్ర కుమార్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని గ్రామాల సర్పంచులతో పాటు ఎంపీటీసీలు, మండల కోఆప్షన్ సభ్యులు ఉదయం 11లకు నిర్వహించనున్న సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

యువత క్రీడల్లో రాణించాలి

మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్: యువత క్రీడల్లో రాణించాలని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం షాద్‌నగర్ పట్టణంలోని మినీ స్టేడియంలో నిర్వహించిన షాద్‌నగర్ ప్రీమియర్ లీగ్ 6 క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో క్రీడాకారులను ఉద్దేశించి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో నైపుణ్యం గల క్రీడాకారులు ఉన్నారని అన్నారు. వారందరు తమ ప్రతిభను వెలికితీయాలని చెప్పారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా శరీరం ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంటుందని తెలిపారు. దీంతో ఎంతో ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీం, రాజుగౌడ్, రాజేందర్‌రెడ్డి, ఖదీర్, మతిన్, మున్నా, మతిన్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

వజ్రాలు కావు.. మంచు బిందువులు



మంచు బిందువులతో వజ్రాల మెరుస్తున్న టమాట మొక్క

టమాట మొక్కపై, పూలకాడలకు నిండుగా గజ్జలు అల్లినట్టు కనిపించేవి వజ్రాలు కావు. మంచు బిందువులు చూడముచ్చటగా ఉన్నాయి. కొందుర్గు మండలం ముట్పూర్ శివారులో ఓ రైతు సాగుచేసిన టమాట పంటలో ఆదివారం ఉదయం కురిసిన మంచుకు మంచు బిందువులు టమాట మొక్కకు, పూలకాడలకు గజ్జల్లా అల్లుకుని చూపరులను కనువిందు చేశాయి. – కొందుర్గు

నేటి నుంచి పహిల్వాన్ షావలి దర్గా ఉర్సు

- ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు
- ప్రత్యేక బస్సులు



షాబాద్‌లో ఉత్సవాలకు ముస్తాబైన పహిల్వాన్ షావలి దర్గా

షాబాద్: జిల్లాలోని షాబాద్ ప్రాంతవాసుల ఆరాధ్య దైవం పహిల్వాన్ షావలి దర్గా ఉర్సు ఉత్సవాలు ఈ నెల 9వ తేదీ సోమవారం (నేడు) నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతి ఏటా నిర్వహించే ఈ ఉత్సవాలు వారం పాటు కొనసాగుతాయని ఉర్సు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. ఉర్సు ఉత్సవాల్లో భాగంగా సోమవారం గంధం కార్యక్రమం ఉంటుంది. రాత్రి పది గంటలకు మల్కీబావి సమీపంలో ఉన్న దర్గా నుంచి గంధం భారీగా ఊరేగింపు జరుగుతుంది. 10న మంగళవారం చిరాగాన్ (దీపారధన), కవ్వాలీ, 11న బుధవారం మీనాబజార్ జరుగుతుందన్నారు. 12, 13వ తేదీన పరిసరాల్లో ఉన్న పహిల్వాన్ చెరువు కట్టపై ఉన్న దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయని చెప్పారు. 14వ తేదీన హైదరాబాద్‌కు చెందిన ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. మహిళలు ప్రత్యేక పార్థనలతో పాటు పాటలు పాడుతారు. 15వ తేదీన గుల్బార్గాకు చెందిన బృందం ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులను తీర్చుకుంటారు. 16, 17, 18వ తేదీల్లో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు కుల మతాలకు అతీతంగా ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకుంటారు.

దర్గా చరిత్ర...

షాబాద్ ప్రాంతంలో పహిల్వాన్ షావలి సజీవ సమాధి కావడంతో ఈ దర్గాకు పహిల్వాన్ షావలి దర్గాగా పేరు వచ్చింది. సుమారు 420 ఏండ్ల చరిత్ర ఈ దర్గా సొంతం. ఆ కాలంలో షాబాద్ ప్రాంతం దట్టమైన అడవిగా ఉండేదని చరిత్ర ద్వారా తెలుస్తున్నది. అయితే, నిజాం వంశానికి చెందిన మాలిక్ షా కుష్టువ్యాధిగ్రస్తుడై మనస్తాపంతో అడవుల పాలయ్యాడు. అడవిలో తిరుగుతూ షాబాద్ ప్రాంతంలోని ప్రస్తుత చెరువు గట్టుపైన పహిల్వాన్ షావలి దర్గా సమీపంలోని రావి వృక్షం కింద సేద తీర్చుకున్నాడు. మాలిక్ షాకు స్వప్నంలోకి దివ్య స్వరూపుడు ఒకరు వచ్చి సమీపంలోని మల్కీ బావిలో నీళ్లు తాగి చెరువు పక్కనే ఉన్న ప్రస్తుత పహిల్వాన్ షావలి దర్గా వద్ద రావి చెట్టు కింద ప్రార్థన చేయాలని సూచించాడు. దీంతో మాలిక్‌షా అదే విధంగా చేసి వ్యాధి నుంచి విముక్తి పొంది నిజాం వారసత్వంలో ఉన్నత స్థానాన్ని పొందారు. వెంటనే మాలిక్‌షా షాబాద్‌లో దర్గా నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నాటి నుంచి నేటి వరకు ఈ ప్రాంతంలోని అన్ని మతాల ప్రజలు సమైక్యంగా ప్రార్థనలు, పూజలే కాకుండా మహబూబ్‌నగర్, రంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్ జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి ఉత్సవాల్లో పాల్గొంటారు.

ఏర్పాట్లు పూర్తి...

వారం పాటు సాగే ఉర్సు ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు దర్గా నిర్వాహక కమిటీ సభ్యులు తౌఫీక్, మజీద్, సత్తార్, ఇస్మల్, సలీం, తాజ్, ముజీబ్, సత్తార్ తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ దర్గాకు రంగులు వేసి అందమైన విద్యుత్ దీపాలతో అలకరిస్తున్నారు. షాబాద్ పహిల్వాన్ షావలి దర్గా ఉత్సవాలకు ప్రత్యేక బస్సులు నడిపించనున్నారు. షాద్‌నగర్, మెహిదీపట్నం, రాజేంద్రనగర్ తదితర డిపోలకు చెందిన బస్సులు అరగంటకో బస్సు వస్తుంది. చేవెళ్ల, షాద్‌నగర్‌ల నుంచి షాబాద్‌కు ప్రత్యేకంగా బస్సులు నడిపించనున్నారు.

హాజరుకానున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యేలు

ఉర్సు ఉత్సవాలకు మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల, కొడంగల్ ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, పట్నం నరేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి, ఎంపీపీ కోట్ల ప్రశాంతి, వైస్ ఎంపీపీ జడల లక్ష్మి హాజరవుతున్నట్లు దర్గా నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా షాబాద్ సీఐ గురువయ్యగౌడ్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.



దర్గా ముఖద్వారం